క్లుప్తంగా

బక్రీద్‌ను ప్రశాంతంగా జరుపుకోవాలి



మాట్లాడుతున్న డీఎస్పీ చంద్రభాను

ఇల్లెందు: ఒక మతం వారు జరుపుకునే పండుగలను మరోమతం వారు గౌరవించాలని, పట్టణంలో ప్రశాంత వాతావరణం కల్పించాలని డీఎస్పీ ఎస్.చంద్రభాను కోరారు. ఆదివారం ఇల్లెందు పోలీస్ స్టేషన్‌లో ముస్లిం, హిందూ మతపెద్దలతో శాంతి కమిటీ మీటింగ్ నిర్వహించారు. మాట్లాడుతూ.. బక్రీద్ పండుగ సందర్భంగా పట్టణంలో ప్రశాంతతను నెలకొల్పి సహకరించాలని కోరారు. ఎక్కడ ఎలాంటి ఆటంకం లేకుండా పోలీసులకు సహకరించాలని కోరారు. సంప్రదాయాలను గౌరవిస్తూ పరస్పర సహకారంతో ముందుకు సాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీఐ బత్తుల సత్యనారాయణ పాల్గొన్నారు.

బక్రీద్ శుభాకాంక్షలు



ఎమ్మెల్యే కోరం కనకయ్య

ఇల్లెందు: బక్రీద్ పండుగ సందర్భంగా నియోజకవర్గ ప్రజలకు ఎమ్మెల్యే కోరం కనకయ్య ఆదివారం శుభాకాంక్షలు తెలిపారు. త్యాగానికి ప్రతీక అయిన బక్రీద్ పండుగను సోమవారం ముస్లింలు ఆనందంగా జరుపుకోవాలని కోరారు. పవిత్ర పర్వదినం రోజున విభేధాలు తొలిగిపోవాలని, ప్రజల మధ్య ఐక్యత, స్నేహం పరిఢవిల్లాలని కోరారు. పట్టణంలో ముస్లింలు ప్రశాంతంగా పండుగ జరుపుకునేలా అధికారులు తగు చర్యలు తీసుకోవాలని, పోలీసులు సహాయ సహకారాలు అందించాలని సూచించారు. అదేవిధంగా మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే హరిప్రియ ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు.

విరాళం..

పాల్వంచరూరల్: మండల పరిధి కేశవాపురం, జగన్నాథపురం గ్రామాల మధ్య కొలువై ఉన్న పెద్దమ్మతల్లి ఆలయ పునర్నిర్మాణానికి ఒడ్డుగూడెంకు చెందిన చామకూరి నాగభూషణం, సుగుణమ్మ దంపతులు రూ.5,116 అందజేసినట్లు ఆలయ ఈఓ జి.సుదర్శన్ ఆదివారం తెలిపారు. విరాళాలు అందజేసిన భక్తులకు అమ్మవారి శేషవస్త్ర ప్రసాదాలను అందజేశారు.

సీఐని అభినందించిన మున్సిపల్ చైర్మన్



సత్యనారాయణను అభినందిస్తున్న డీవీ

ఇల్లెందు: ఇల్లెందు సీఐగా బాధ్యతలు చేపట్టిన బత్తుల సత్యనారాయణను మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు అభినందించారు. ఆదివారం స్టేషన్‌లో ఆయనను కలిసిన చైర్మన్ శాలువ, పూలమాలతో సత్కరించారు. శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట కౌన్సిలర్లు కటకం పద్మావతి, సయ్యద్ ఆజం, నవీన్, ఈశ్వర్, రవీందర్‌లు కాంగ్రెస్ యూత్ సభ్యులు కార్తీక్ యాదవ్, ఆర్‌కే, వినోద్, రాజు, శ్రావణ్ ఉన్నారు.

ఏటీడీఓగా రాధ నియామకం



సూర్నపాక రాధ

ఇల్లెందురూరల్: ఇల్లెందు ఏటీడీఓగా సూర్నపాక రాధ నియమితులయ్యారు. ఇప్పటి వరకు ఇక్కడ విధులు నిర్వహించిన రూపాదేవిని ఖమ్మంనకు బదిలీ చేయడంతో చర్ల మండలంలో వార్డెన్‌గా విధులు నిర్వహిస్తున్న సూర్నపాక రాధను పదోన్నతిపై ఇల్లెందు ఏటీడీఓగా బదిలీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆశ్రమ పాఠశాలలు, హాస్టళ్ల పనితీరు మెరుగుపర్చేందుకు కృషి చేస్తానని చెప్పారు.

గాంధీపథం ఆధ్వర్యంలో అన్నదానం

కొత్తగూడెంఅర్బన్: ఫాదర్స్ డే సందర్భంగా కొత్తగూడెం గాంధీపథం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ అధ్యక్షుడు చింతలచెర్వు గెర్షోము మాట్లాడుతూ... తన తండ్రి మిలాంగ్‌టన్‌ను ఫాదర్స్ డే సందర్భంగా గుర్తు చేసుకొని పేదలకు అన్నదానం చేసినట్లు వివరించారు. కుటుంబానికి గురువు, దైవం నాన్నలే అన్నారు. ప్రతి ఏడాదీ ఇలాగే చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

కరుణించని వరుణుడు..

- ఆందోళనలో రైతులు
- విత్తనాలు విత్తి ఆకాశం వైపు ఎదురుచూపు
- తేమ ఉంటేనే విత్తుకోవాలంటున్న అధికారులు



దుక్కి సిద్ధం చేసుకుంటున్న రైతు

ఇల్లెందురూరల్: మబ్బులు కమ్ముకుంటున్నాయి.. మేఘాలు ఊరిస్తున్నాయి.. వాతావరణం చల్లబడుతోంది.. కానీ చినుకు మాత్రం నేల జారడం లేదు. వర్షాలు కురుస్తాయనే భరోసాతో విత్తనాలు వేసిన రైతులు ఆకాశం వైపు ఆశగా ఎదురుచూస్తున్నారు. మరికొందరు రైతులు దుక్కులు దున్ని విత్తుకునేందుకు సిద్ధంగా ఉన్నారు.

దోబూచులాడుతున్న వరణుడు..

జూన్ మొదటి వారంలో ఆశాజనకంగా వర్షాలు కురిసినప్పటికీ నేలలో తేమశాతం మాత్రం కనీస స్థాయికి కూడా చేరుకోలేదు. నైరుతి రుతుపవనాలతో ఆశించిన స్థాయిలో వర్షాలు రాకపోవడంతో వారంరోజులుగా పగటి ఉష్ణోగ్రతలు అధికంగానే నమోదవుతున్నాయి. సాయంత్రం వేళ మబ్బులు దోబూచులాడుతున్నాయి. ఇలా వెనువెంటనే మారుతున్న వాతావరణ పరిస్థితులపై రైతులు ఆందోళన చెందుతున్నారు.

అధిక విస్తీర్ణం వర్షాధారమే..

మండలంలో ప్రస్తుత వానాకాలంలో సుమారు 50వేల ఎకరాల్లో వివిధ పంటలు సాగవుతాయని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు. చెప్పుకోవడానికి 100 ఎకరాలకు సాగునీరు అందించే చెరువులు లేకపోవడం, వాగులపై చెక్‌డ్యాంలు నిర్మించకపోవడం వంటి కారణాలతో మండలంలో 70 శాతం సాగు విస్తీర్ణం వర్షాధారమే. అత్యధిక విస్తీర్ణం ఆకాశపాయ పంటలే. కొన్నిచోట్ల బోర్లు, బావుల కింత సాగు చేస్తుంటారు. చెరువులు, కుంటల కింద సుమారు 5వేల ఎకరాలలో మాత్రమే పంటలు అది కూడా అధిక విస్తీర్ణంలో వరి సాగవుతోంది. ఇటువంటి పరిస్థితిలో వర్షాలు అనుకూలంగా కురిస్తేనే .. పంటలు పండే అవకాశం ఉంది.

వడలిపోతున్న మొలకలు...

ప్రస్తుత వానాకాలంలో ఇప్పటికే కొంతమంది రైతులు దుక్కులు సిద్ధం చేసుకొని విత్తన కొనుగోళ్లలో నిమగ్నమయ్యారు. మరికొంత మంది రైతులు ఇప్పటికే విత్తనాలు విత్తుకున్నారు. జూన్ ప్రారంభంలో వర్షాలు ఆశాజనకంగా కురవడంతో సుమారు 60 శాతం మేర పత్తి, మొక్కజొన్న విత్తనాలు విత్తుకున్నట్లు వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు. ఎరువులు వేసి విత్తుకున్న తరువాత ఆశించిన స్థాయిలో వర్షం పడకపోతే భూమిలోనే విత్తనాలు పాట్లిపోయే అవకాశం ఉంది. ఇక ఇప్పుడిప్పుడే మొలకెత్తిన మొలకలు ఎండవేడిమికి వడలిపోతున్నాయి. దీంతో రైతులు దినదినగండంగా వర్షం కోసం ఆశగా ఎదురుచూస్తున్నారు.



వడలిపోతున్న పత్తి మొలకలు

తేమశాతం అనుకూలంగా ఉంటేనే..

సాధారణగా భూమిలో తేమ శాతం అనుకూలంగా ఉన్నప్పుడే విత్తుకుంటే విత్తనం మొలకెత్తే అవకాశం ఉంది. ఒకటి, రెండు వర్షాలు కురియగానే విత్తుకుంటే ఆ తరువాత వర్షం కురియకుంటే విత్తు భూమిలోనే మురిగిపోయే ప్రమాదం లేకపోలేదు. నల్లరేగడి నేలలో 60 నుంచి 70 మి.మీ, ఎర్ర నేలల్లో అయితే 40 నుంచి 50 మి.మీ వర్షపాతం నమోదయితేనే విత్తనాలు విత్తుకోవాలని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. భూమిలో తేమ 50 నుంచి 75 శాతం ఉంటే విత్తుకోవడానికి అనుకూలంగా ఉంటుందని సూచిస్తున్నారు. వానాకాలం పంటలు ఆలస్యమైనా జూలై 15లోగా విత్తుకోవడానికి అవకాశం ఉంటుందని పేర్కొంటున్నారు. ఇదిలా ఉండగా వాతావరణం మేఘావృతమై ఉండటంతో వర్షాలు కురుస్తాయనే ఆశతో రైతులు ఉన్నారు. అదును దాటితే ఆశించిన దిగుబడులు రావని రైతులు అంటున్నారు.

వర్షాలు కురిస్తేనే..



ఈ నెల ప్రారంభంలో ఆశించిన స్థాయిలో వర్షాలు కురవడం వల్ల పత్తి విత్తనాలు విత్తుకున్నాం. మొలకలు ఆశాజనకంగా ఉన్నాయి. ఈ తరుణంలో మొక్కకు నీటి తడులు అవసరం. వారం రోజులుగా ఎండతీవ్రత అధికంగా ఉండటంతో మొలకలు వడలిపోతున్నాయి. వర్షం కురిస్తేనే మొక్కలు నిలబడతాయి.

– వాంకుడోత్ శ్రీను, రైతు, పోచారంతండా

తేమ ఉంటేనే విత్తుకోవాలి..



తొలకరితోపాటు రెండు పెద్ద వర్షాలు కురిశాకే విత్తనాలు విత్తుకోవాలి. భూమిలో విత్తనం వేసిన వారం రోజుల పాటు లోపలి వేడిని తట్టుకోలేదు. ఆ తరువాత వేడితో స్వభావం మారి మొలకెత్తే శాతం తగ్గిపోతుంది. చిన్నపాటి జల్లులు కురిసినా విత్తనం మురిగిపోతుంది. నేలలో తేమ శాతం తగు మోతాదులో ఉన్నప్పుడే విత్తుకోవాలి.

– సతీష్, ఏఓ, ఇల్లెందు మండలం

మేలైన విత్తనం.. పంటకు ప్రాణం

సుజాతనగర్: పంటల సాగులో అత్యంత ప్రధానమైనది విత్తనాలు ఎంపికతో పాటు కొనుగోలు సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు. ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో రైతులు దుక్కులు దున్ని విత్తనాలు విత్తేందుకు సిద్ధం చేస్తుండగా... ఇప్పటికే కొంతమంది రైతులు విత్తనాలు కూడా విత్తి వర్షం కోసం ఎదురు చూస్తున్నారు. విత్తనం సరిగా లేకపోతే.. పెట్టుబడులు వృథా కావడంతో పాటు పంట చేతికి రాక తీవ్రంగా నష్టపోవాల్సిన పరిస్థితి ఉంటుంది. రైతులు వ్యవసాయాధికారుల సూచనలు పాటించి విత్తనాలను కొనుగోలు చేయాలని వ్యవసాయాధికారిణి గాండ్ల నర్మద సూచించారు. విత్తనం కొనుగోలు చేసే సమయంలో ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటే నాసిరకం విత్తనంతో నష్టపోయే పరిస్థితిలో పరిహారం పొందడానికి అవకాశముంటుందన్నారు. విత్తనాల కొనుగోలులో తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆమె వివరించారు.

- ప్రభుత్వం ధ్రువీకరించిన ప్యాకెట్లు, సంచుల్లో ఉన్న విత్తనాలను మాత్రమే కొనుగోలు చేయాలి. రశీదు తప్పక తీసుకోవాలి.
- సంచులపై, ప్యాకెట్లపై క్రమ సంఖ్య, బరువు, కంపెనీ పేరు, తయారీదారుని పేరు, వినియోగించడానికి చివరి తేదీ మొదలైన వివరాలు ఉన్నాయో, లేదో సరి చూసుకోవాలి.
- విత్తనాలు విత్తిన తర్వాత ఖాళీ ప్యాకెట్లు, సంచులను జాగ్రత్తగా దాచి ఉంచాలి. ఒకవేళ నాసిరకం విత్తనాలైతే నష్టం వాటిల్లితే పరిహారం కోరేందుకు వినియోగదారుల ఫోరాన్ని ఆశ్రయించిన సమయంలో ఖాళీ సంచులు, ప్యాకెట్లు రైతు క్లెయిమ్ నిరూపించుకోవడానికి సాక్ష్యాలుగా ఉపయోగపడతాయి.
- కొన్ని నమూనా విత్తనాలను జాగ్రత్తగా దాచి ఉంచడం వల్ల అవసరమైతే వాటిని న్యాయస్థానంలో చూపించి వివాదాన్ని పరిష్కరించుకోవడానికి విశ్లేషణ కోసం ల్యాబ్‌కు పంపడానికి అవకాశముంటుంది.

బీసీలు అన్నిరంగాల్లో సంఘటితం కావాలి



అభివాదం చేస్తున్న కమిటీ సభ్యులు

ఇల్లెందు: అట్టడుగున ఉన్న అణగారిన వర్గాలైన బీసీలు అన్నిరంగాల్లో సంఘటితం కావాలని పట్టణ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు గోచికొండ సత్యనారాయణ కోరారు. ఆదివారం ఇల్లెందులోని పెన్షనర్ భవన్‌లో జరిగిన సమావేశంలో పట్టణ బీసీ సంక్షేమ సంఘాన్ని విస్తరించారు. 16 మందితో కూడిన నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడు పీఏ ప్రసాద్, ప్రధాన కార్యదర్శి కె.సమ్మయ్యల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నూతన కమిటీకి ఉపాధ్యక్షుడిగా ఐలయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా సింగు నాగేశ్వరరావు, ఉపాధ్యక్షుడిగా కె.భిక్షపతి, డాక్టర్ సత్యనారాయణ, ప్రతాప్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా కె.రాజేందర్, గందె సదానందం, కోశాధికారిగా వి.భాస్కర్, ఆర్గనైజింగ్ సెక్రెటరీగా గుడివాడ నాగేశ్వరరావు, రాజేష్, రంజిత్, ఉమామహేశ్వరరావు, కె.సత్యనారాయణ, మాధవరావు తదితరులను ఎన్నుకున్నట్లు తెలిపారు.

'నిమ్మల' మరణం తీరని లోటు



సోమిరెడ్డి (ఫైల్)

కొత్తగూడెంటౌన్: సీనియర్ న్యాయవాది నిమ్మల సోమిరెడ్డి మరణం తీరని లోటని కొత్తగూడెం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లక్కినేని సత్యనారాయణ అన్నారు. ఆదివారం జరిగిన కార్యక్రమంలో కొత్తగూడెం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో లక్కినేని సత్యనారాయణతో పాటు సభ్యులు నిమ్మల సోమిరెడ్డికి సంతాపం తెలియజేశారు. ఈ సందర్భంగా లక్కినేని మాట్లాడారు.

హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ నిమ్మల సోమిరెడ్డి మరణించినట్లు చెప్పారు. కొత్తగూడెంలో జూనియర్ న్యాయవాదిగా చేరి అనతికాలంలోనే ప్రముఖ న్యాయవాదిగా సమాజానికి సేవ చేశారన్నారు. అలాంటి సీనియర్ న్యాయవాది మరణం తీరని లోటని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు తోట మల్లేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి ఎంఎస్ఆర్ రవిచంద్ర, లైబ్రరీ సెక్రటరీ సాధిక్ పాషా, మహిళా రిప్రజెంటేటివ్ ఎస్.ప్రతిభ, పబ్లిక్ ప్రాసిక్యూటర్ పి.రాధాకృష్ణమూర్తి, అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ వెలగల నాగిరెడ్డి, రావి విజయ్‌కుమార్, సీనియర్ న్యాయవాదులు ఎం.ఏ రజాక్, కే.పుల్లయ్య, ఎస్.రమణారెడ్డి, పానుగోటి కిషన్‌రావు, కిలారు పురుషోత్తం, సింగ్ ఉపేందర్, పి.నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

21న ఆటో, మోటార్ వర్కర్స్ రాష్ట్ర మహాసభ



మాట్లాడుతున్న జనార్దన్

ఇల్లెందు: తెలంగాణలో 20 లక్షలకు పైగా వివిధ రంగాల్లో మోటార్ కార్మికులు పని చేస్తున్నారని గడిచిన పదేళ్ల కాలంలో మోదీ ప్రభుత్వం ఈ వర్గానికి ఉపయోగపడే ఒక్క పని కూడా చేయలేదని ఇఫ్టూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.జనార్దన్ అన్నారు. ఆదివారం ఇల్లెందులో ఇఫ్టూ రాష్ట్ర స్థాయి మహాసభ సన్నాహక సమావేశం జరిగింది. ఈ సమావేశంలో జనార్దన్ మాట్లాడుతూ... మోటార్ కార్మికులకు భద్రతతో కూడిన సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయలేదన్నారు. మోదీ ప్రభుత్వం 2019 మోటార్ వాహన చట్టం తెచ్చి కార్మికులను అధోగతి పాలు చేసిందన్నారు. తెలంగాణలో ఆరునెలలు గడిచినా ఈ ప్రభుత్వం కార్మిక ప్రయోజనాలను నెరవేర్చేలా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదన్నారు. ఈ నెల 21న జరగనున్న మహాసభలో భవిష్యత్ పోరాటాల రూపకల్పన కోసం మహాసభ నిర్వహించి కర్తవ్యాలను రూపుదిద్దుకుంటామని తెలిపారు. ఈ మహాసభను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇఫ్టూ రాష్ట్ర, జిల్లా నాయకులు నరేష్, సారంగపాణి, నాగేశ్వరరావు, వెంకటేశ్వర్లు, మోహన్‌రావు, రవికుమార్, కొమురయ్య, ఉప్పలయ్య, యాకన్న, వెంకన్న, కోటయ్య పాల్గొన్నారు.

ఘనంగా హనుమత్ కల్యాణం



అన్నదానం ప్రారంభిస్తున్న కొత్వాల

పాల్వంచ: స్థానిక పాత పాల్వంచ భక్తాంజనేయ స్వామి ఆలయంలో జ్యేష్ఠ శుద్ధ దశమి సందర్భంగా ఆదివారం సువర్చల ఆంజనేయ స్వామి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. పూజారులు భాను, రంగాచారిల ఆధ్వర్యంలో దేవాలయంలో శ్రీ రామదండు హనుమాన్ సేవా సమితి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం షణ్ముఖ కిరాణ మర్చంట్స్ యజమాని కూర రాజశేఖర్ కుమారుడు షణ్ముఖ దంపతుల ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ యర్రంశెట్టి ముత్తయ్య, కొండం వెంకన్న, పైడిపల్లి మహేశ్, గండు భారత్, స్థానికులు పాల్గొన్నారు.

వ్యాధి నిర్ధారణలో పరీక్షలు కీలకం

ఇల్లెందు: ప్రతీ వ్యక్తి ఆరు నెలలకోసారి వివిధ రకాల పరీక్షలు నిర్వహించుకోవాలని, వ్యాధి నిర్ధారణ జరిగితే ఏ జబ్బు ఉందో తెలుస్తుందని, అప్పుడే సరైన వైద్యం పొందే అవకాశం ఉంటుందని మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు అన్నారు. ఆదివారం ఇల్లెందు మున్సిపల్ కార్యాలయంలో ఇండోకేర్ ఆస్పత్రి ఖమ్మం వారిచే హెల్త్ క్యాంపు ఏర్పాటు చేశారు. డాక్టర్ షేక్ ఫయాజ్ (ఎండీ ఫలమనాలజిస్ట్) ఆధ్వర్యంలో రోగులను పరీక్షించారు. పలు రకాల పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ అంకుషావలీ, రాధాకృష్ణ, కౌన్సిలర్లు అంకెపాక నవీన్, కటకం పద్మావతి, కుమ్మరి రవీందర్, మొగిలి లక్ష్మి తదితరులు ఉన్నారు.

లింక్ కెనాల్‌ను వ్యతిరేకించండి



కెనాల్‌ను పరిశీలిస్తున్న నాయకులు

జూలూరుపాడు: సీతారామ ప్రాజెక్టు ప్రధాన కాలువను జూలూరుపాడు నుంచి కామేపల్లి మీదుగా పాలేరుకు రాకుండా ఆపి ఏన్కూరు వరకు లింక్ కెనాల్ తీసి సాగర్ కాలువకు కలపడాన్ని టీడీపీ లీగల్ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లెంపాటి అప్పారావు, ఖమ్మం జిల్లా ఉపాధ్యక్షుడు కొండబాల కరుణాకర్ తీవ్రంగా వ్యతిరేకించారు. ఆదివారం జూలూరుపాడు వద్ద గండి కొట్టి ఎలైన్‌మెంట్ మార్చిన ప్రదేశాన్ని టీడీపీ నాయకుల బృందం పరిశీలించింది. అనంతరం మాట్లాడుతూ... జూలూరుపాడు నుంచి చీమలపాడు అటవీ ప్రాంతం గుండా కామేపల్లి మండలం మీదుగా తిరుమలాయపాలెం వరకు రావాల్సిన సీతారామ కాలువను వదిలేసి జూలూరుపాడు నుంచి లింక్ కెనాల్ ద్వారా ఏన్కూరు సాగర్ కాలువకు మళ్లించడం సరైంది కాదన్నారు.

కామేపల్లి, కారేపల్లి, గార్ల, డోర్నకల్లు, రఘునాథపాలెం, పాలేరు, తిరుమలాయపాలెం, కూసుమంచి ప్రాంతాలకు నీళ్లు రాని పరిస్థితి ఏర్పడిందన్నారు. జూలూరుపాడు, వినోభానగర్ గ్రామాల రైతులకు కూడా తీరని అన్యాయం జరుగుతుందన్నారు. సీతారామ ప్రాజెక్టు కెనాల్ నిర్మాణంతో భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం కూడా అందించలేదని, ఎకరానికి రూ.50 లక్షలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏన్కూరు లింక్ కెనాల్ పనులను ఆపివేయాలని నాయకులు ప్రభుత్వాన్ని కోరారు.

కార్యక్రమంలో గుండెపిన్ని నాగేశ్వరరావు, రోకటి నరసింహారావు, కర్నాటి అశ్వనీకుమార్, దొడ్డా కృష్ణారావు, చలమల గోవిందు, యల్లంకి కొండలరావు, యల్లంకి శ్రీనివాసరావు, సిరికొండ తిరుమలరావు, చిలుకూరి కోటేశ్వరరావు, నాగేశ్వరరావు, తంబారపు రమేష్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయండి

జూలూరుపాడు: మొక్కలు నాటాలని, వాటి ప్రాముఖ్యతను వివరిస్తూ ఏన్కూరు మండలానికి చెందిన కొంటు సాంబయ్య వినూత్నంగా ప్రచారం చేస్తున్నాడు. ఈ క్రమంలో ఆదివారం జూలూరుపాడులో సాంబయ్య మొక్కల ప్రాముఖ్యతపై ప్రజలకు అవగాహన కల్పించారు. మొక్కలు నాటకపోతే రానున్న భవిష్యత్‌లో మానవాళికి ప్రమాదం పొంచి ఉందని, ప్రతీఒక్కరు ఆక్సిజన్ సిలిండర్ వీపుకు కట్టుకొని తిరగాల్సిన పరిస్థితి వస్తుందన్నారు. పిల్లలకు ఆస్తులు కూడబెట్టి ఇవ్వడం కాదని, మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలన్నారు. భవిష్యత్ తరాలకు రూ.కోట్ల ఆస్తులు ఇవ్వాల్సిన పని లేదు, సంపూర్ణ ఆరోగ్యాన్ని ఇవ్వాలన్నారు. అడవులు అంతరించిపోవడం, మొక్కలు నాటకపోవడం వల్ల వాతావరణ సమతుల్యత దెబ్బతినడంతో తేమశాతం తగ్గి అధిక ఉష్ణోగ్రతలు పెరుగుతాయన్నారు. అందుకే ప్రతీఒక్కరు మొక్కలు నాటి ప్రకృతిని కాపాడుకుందామన్నారు.

పల్లెల్లో గంగమ్మతల్లికి పూజలు

ఇల్లెందురూరల్: మండలంలోని పలు గ్రామాలలో యాదవులు గంగమ్మతల్లికి ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. సంప్రదాయ వస్త్రధారణతో నృత్యాలు చేస్తూ ఇంటివద్ద సిద్ధం చేసిన ప్రసాదాన్ని గంగమ్మతల్లికి నైవేద్యంగా సమర్పించారు. వర్షాలు సమృద్ధిగా కురవాలని, పంటలు బాగా పండాలని గంగమ్మతల్లిని వేడుకున్నారు. అనంతరం అమ్మవారికి మేకలు బలి ఇచ్చి మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో కూరాకుల వెంకన్న, బొల్ల కృష్ణ, ఊడుగుల అశోక్ తదితరులు పాల్గొన్నారు.

పాల్వంచరూరల్: వర్షాలు కురవాలని, పంటలు పండాలని గంగమ్మ తల్లికి పూజలు చేసి జలాభిషేకం చేశారు. మండల పరిధి పాతసూరారం గ్రామంలో ఆదివారం గంగమ్మతల్లికి స్థానికులు కిన్నెరసాని వాగు నుంచి బిందెలతో శుద్ధ జలాలను తీసుకొచ్చి జలాభిషేకం చేసి, పూజలు నిర్వహించారు.



పాల్వంచరూరల్: పాతసూరారంలో గంగమ్మ తల్లికి పూజలు చేస్తున్న స్థానికులు



ఇల్లెందురూరల్: అమ్మవారికి నైవేద్యం తీసుకెళ్తున్న మహిళలు



పాల్వంచరూరల్: బోనాలతో వెళ్తున్న మహిళలు

పెద్దమ్మతల్లి గుడి వద్ద భక్తుల అవస్థలు

- అసౌకర్యాలతో ఫంక్షన్ హాళ్లు
- కిచెన్ షెడ్ లేక ఆరుబయట వంటలు
- అస్తవ్యస్తంగా డ్రెయినేజీ
- పట్టించుకోని ఎండోమెంట్ అధికారులు



పెద్దమ్మతల్లి ఆలయం వద్ద ఫంక్షన్ హాళ్లు

పాల్వంచరూరల్: పెద్దమ్మ గుడికి చెందిన ఫంక్షన్ హాళ్లలో అసౌకర్యాలతో భక్తులు అవస్థలు పడుతున్నారు. కిచెన్ షెడ్ నిర్మాణం చేయకపోవడంతో ఫంక్షన్ హాల్‌ను అద్దెకు తీసుకున్న భక్తులు ఆరుబయట వంటలు వండుకుంటూ అవస్థలు పడుతున్నారు. వర్షాకాలం ఎలా వంటలు చేసుకోవాలో అర్థం కాని పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అస్తవ్యస్తంగా డ్రెయినేజీ నిర్మాణం చేయడంతో ఎక్కడి అక్కడే నిల్ల ఉంటోంది. మండల పరిధి కేశవాపురం, జగన్నాథపురం గ్రామాల మధ్య కొలువై ఉన్న శ్రీకనకదుర్గ (పెద్దమ్మతల్లి) ఆలయం వద్ద రూ.3.90 కోట్ల వ్యయం చేసి రెండు ఫంక్షన్ హాళ్లను ఎండోమెంట్ శాఖ ఆధ్వర్యంలో నిర్మించారు. ఇందులో రూ.2.21కోట్ల ఖర్చుతో 700 మంది సామర్థ్యం కలిగిన పెద్ద ఫంక్షన్ హాల్, రూ.1.69 కోట్ల వ్యయం చేసి 500 మంది సామర్థ్యం కలిగిన చిన్న ఫంక్షన్ హాల్‌ను 2020 జూన్‌లో నిర్మాణం పనులు ప్రారంభించారు. మూడేళ్లకు ఆ రెండు ఫంక్షన్ హాల్స్ నిర్మాణ పనులు పూర్తి చేసి కాంట్రాక్టర్‌కు అప్పగించారు.

ప్రైవేట్ ఫంక్షన్ హాళ్లలో అధిక ఫీజులు వసూళ్లు...

అమ్మవారి సన్నిధికి వచ్చే భక్తులకు ప్రైవేట్ ఫంక్షన్ హాళ్లకు వెళితే అధికంగా అద్దెలు వసూళ్లు చేస్తున్నారని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోజురోజుకు పెద్దమ్మతల్లిని దర్శించుకునే భక్తుల సంఖ్య పెరుగుతోంది. ఫంక్షన్ హాల్స్ కావాలంటే నెలరోజుల ముందు బుక్ చేసుకుంటే తప్ప ప్రైవేట్ ఫంక్షన్ హాళ్లు కూడా సమయానికి దొరకని పరిస్థితి నెలకొంది. ఆలయానికి చెందిన ఫంక్షన్ హాళ్లు అయితే సౌకర్యంగా ఉంటాయని భక్తులు అద్దెకు తీసుకుంటే అసౌకర్యాలతో అవస్థలు పడుతున్నారు.

రెండూ ఏసీ ఫంక్షన్ హాళ్లే..

రూ.కోట్లు ఖర్చు చేసి నిర్మించిన రెండు ఫంక్షన్ హాళ్లలో ఏసీ, జనరేటర్ సౌకర్యం కల్పించారు. 500 మంది, 700 మంది సామర్థ్యం కలిగిన రెండు ఫంక్షన్ హాళ్లను సామాన్య, మధ్యతరగతి భక్తులకు అందుబాటులో ఉండే అవకాశం కల్పించి, కాంట్రాక్టర్‌కు అప్పగించారు. ఏడాదికి పెద్ద ఫంక్షన్ హాల్‌కు రూ.40 లక్షలు, చిన్న దానికి రూ.34 లక్షల చొప్పున ఎండోమెంట్‌శాఖ అధికారులు కాంట్రాక్ట్‌కు ఇచ్చారు.

కిచెన్ షెడ్ లేక అవస్థలు..

రెండు ఫంక్షన్ హాల్స్ చూసేందుకు బాగానే ఉన్నా వాటికి కిచెన్ లేకుండా నిర్మాణం చేశారు. దీంతో అద్దెలకు తీసుకున్న భక్తులు వంటలు చేసుకోవాలంటే ఇబ్బంది పడుతున్నారు. ఎండాకాలంలో ఆరుబయట వంటలు వండుకుంటున్నారు. కానీ వర్షాకాలంలో ఇబ్బంది పడుతున్నట్లు భక్తులు ఆవేదన వ్యక్తం చేశారు. దీనికితోడు డ్రెయినేజీ పైపులైన్ చిన్నగా నిర్మాణం చేయడం వలన నీరు బయటకు వెళ్లపోవడంతో అవస్థలు పడుతున్నారు. పలుమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఫంక్షన్ హాల్ నిర్వాహకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఈఓ స్పందించి సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నారు.

అందుబాటులో లేని ఈఓ..

ఆలయ రెగ్యులర్ ఈఓ రెండు నెలల క్రితం సెలవు మీద వెళ్లారు. అప్పటి నుంచి ఇన్‌చార్జ్ ఈఓగా సుదర్శన్ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. వారికి భద్రాచలంలోని అమ్మవారి ఆలయం, ఆంజనేయ స్వామి ఆలయంతో పాటు మోతే ఆలయం బాధ్యతలు పర్యవేక్షిస్తూనే పెద్దమ్మగుడి ఇన్‌చార్జ్ ఈఓ అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. అప్పడప్పుడు మాత్రమే ఆలయానికి వచ్చిపోవడం వలన ఇక్కడి సమస్యలను పట్టించుకోవడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఫంక్షన్ హాళ్లలో అసౌకర్యాలపై వివరణ కోసం ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు.